చాకరిమెట్ల ఆంజనేయస్వామికి ఎమ్మెల్సీ పూజలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, తదితరులు

దుండిగల్, ఏప్రిల్ 13 : నర్సాపూర్ సమీపంలోని చాకరిమెట్ల ఆంజనేయ స్వామి దేవాలయాన్ని శనివారం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

● ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు,పార్టీ శ్రేణులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 13 : జీడిమెట్ల డివిజన్ జయరాంనగర్‌లో గ్రామదేవతలైన మైసమ్మ, పోచమ్మ తల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామదేవతల ఆరాధన తెలంగాణలో ప్రత్యేక సంస్కృతి అన్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు కుంటి మల్లేశ్,ప్రధాన కార్యదర్శి మన్యహరి,ఉపాధ్యక్షుడు భిక్షపతి, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహులు, సభ్యులు నరేశ్, ఉపేందర్, రమేశ్, రాములు స్థానికులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో బీఆర్ఎస్, బీజేపీ మధ్యే పోటీ!

● బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయం
● కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలాజీనగర్‌లో బీఆర్ఎస్ నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పక్కన ఇన్‌చార్జి బేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 13 : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని.. ప్రజలందరి ఆశీర్వాదంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమని.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే కృష్ణారావు, నియోజకవర ఇన్‌చార్జి బేతి సుభాష్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో కల్లిబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, నాలుగు నెలలవుతున్నా అభివృద్ధి పనుల ఊసేలేదని కాలనీలు, బస్తీల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే పట్టించుకునే నాయకుడే లేడని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కాలనీలు, బస్తీలను అభివృద్ధి పరచామని.. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, పింఛన్ పెంపు, మహిళలకు రూ. 2,500 అందించడంలో విఫలమైందన్నారు.

ఇబ్బంది పెడితే పోరాడుదాం..

కూకట్‌పల్లిలో పేదవారు ఇండ్లు కట్టుకుంటే కాంగ్రెస్ నేతలు ఇబ్బందులు పెట్టడం సరికాదని.. ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు హితవు పలికారు. కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ సైన్యం 12వేల మంది ఉన్నారని.. 100 మందిని ఇబ్బంది పెట్టి కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటే బీఆర్ఎస్‌కు ఏలాంటి నష్టమేమీలేదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు కష్టాలొస్తే అండగా ఉంటానని.. సమిష్టిగా పోరాడి వారి ఆగడాలను అడ్డుకుందామన్నారు.

మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగరేద్దాం..

గతంలో ఎంపీగా గెలిచిన సీఎం రేవంతర్ రెడ్డి మల్కాజిగిరికి చేసిందేమీలేదని.. ఇక్కడ బీఆర్ఎస్ జెండా ఎగరేస్తే ఎంపీ నిధులతో మరింతగా అభివృద్ధి అవుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసేలా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు మాయమాటలు చెప్పే నాయకుల మాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ పార్టీని ఆదరించి భారీ మెజార్టీని అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శిరీషా బాబూరావు, మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలిన గులాబీ శ్రేణులు

బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సభకు వెళ్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఏప్రిల్ 13: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో చేవెళ్లలో జరిగే సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నాయకత్వంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, నార్నె శ్రీనివాస్‌రావు, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులారఘునాథ్‌రెడ్డి, మాధవరం రోజాదేవి రంగారావు, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా సహా నియోజకవర్గంలోని 11 డివిజన్ల నుంచి పార్టీ నాయకులు, మహిళా నేతలతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ చేవెళ్లలో హ్యాట్రిక్ విజయం గులాబీదేనని, ఇతర పార్టీ అభ్యర్థులకు ఓటమి తప్పదన్నారు. కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంజాయి ప్యాకెట్లు స్వాధీనం.. యువకుడి అరెస్టు

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, నిందితుడు

కొండాపూర్,ఏప్రిల్ 13 : ధూల్‌పేట్‌లో గంజాయి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్ల లో వేసి తిరిగి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాదాపూర్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు విశ్వసనీయ సమాచారంతో గచ్చిబౌలిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటున్న సవదతి బసవరాజప్ప ప్రమోద్ ఇంటిపై దాడి చేశారు. అతడి వద్ద ఉన్న 250 గ్రాముల గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ధూల్‌పేట్‌లో గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా కూలీలకు పొట్లాల రూపంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 16,250 ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

మేడ్చల్, ఏప్రిల్ 13: ఈ నెల 16న గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల కార్యదర్శి జక్కుల త్రిశూల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ కార్యవర్గ సభ్యుడిగా రంగాశ్రీనివాస్‌గౌడ్

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 13 : బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రంగారెడ్డినగర్‌కు చెందిన రంగాశ్రీనివాస్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఓబీసీ విభాగం అధ్యక్షుడు ఆయనకు నియామకపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నేతలు శనివారం రంగాశ్రీనివాస్‌ను అభినందించారు. కేంద్రప్రభుత్వ పథకాల వినియోగం, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నందనం దివాకర్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలంటూ కార్పొరేటర్‌కు వినతి

కొండాపూర్, ఏప్రిల్ 13 : గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల హుడాకాలనీలో మౌలిక వసతుల కల్పించాలని స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి కాలనీవాసులు శనివారం వినతిపత్రం అందజేశారు. నల్లగండ్ల హుడా కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. డివిజన్‌లోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణి శ్రీవల్లికి చేయూత

క్రీడాకారిణి శ్రీవల్లికి రూ. 30 వేల చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, కొండా విజయ్

మాదాపూర్, ఏప్రిల్ 13: కిక్ బాక్సింగ్ జాతీయ క్రీడాకారిణి శ్రీవల్లికి హోప్ ఫౌండేషన్ చేయూతనందించింది. హుడా కాలనీలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌తో కలిసి రూ. 30 వేల చెక్కును అందజేశారు. మేలో టర్కీలో నిర్వహించనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో బీహెచ్ఈఎల్‌కు చెందిన శ్రీవల్లి పాల్గొననున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ తెలిపారు. శ్రీవల్లికి ఖర్చుల కోసం రూ. 30 వేలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, రవీంద్ర ప్రసాద్‌దూబే, మహేశ్ పాల్గొన్నారు.

అలరించిన నృత్యార్చన

మాదాపూర్, ఏప్రిల్ 13: మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో కళాకారులు నృత్య ప్రదర్శనతో సందర్శకులను విశేషంగా అలరించారు. పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం నృత్య ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో భాగంగా మానస నృత్యయ శిక్షణాలయ విద్యార్థులు వినాయక కౌతం, మూషిక వాహన, ముద్దుగారె యశోద, పలుకే బంగారమాయెనా, ఇదిగో భద్రాద్రి, గరుడ గమన వంటి కీర్తనలకు శ్రీవిద్య, సహస్రశ్రీమయి, శాన్వి, మహిశ్రీ, సమన్విత, సిరిచందన, రిశికసాయి, వైత్రశ్రీ, ప్రదీక్ష, సిరిచందన, గగన దీక్షిత నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. అనంతరం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ గావించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో యువకుడికి తీవ్రగాయాలు

జీడిమెట్ల,ఏప్రిల్13 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం రోడామేస్త్రీ నగర్ చెందిన సయ్యద్ సలీం వృత్తిరీత్యా డీజే లైటింగ్స్ చేస్తున్నాడు. శ్రీరామనవమి సందర్భంగా మార్కెండయ నగర్‌లోని హనుమాన్ దేవస్థానంలో లైటింగ్ వేసేందుకు తండ్రితోపాటు కొడుకు సయ్యద్ యాసీం(18) కలిసి పని చేస్తున్నారు. ఈ క్రమంలో యాసీం మైక్ బుంగను ఆలయంపై కడుతుండగా ప్రమాదవశాత్తు హైటెన్షన్ వైర్లకు తగిలి షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని హుటాహుటిన సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి మిషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

పెంటమ్మ కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, లయన్ రాజశేఖర్

అల్లాపూర్, ఏప్రిల్ 13 : మోతీనగర్ పరిధి కబీర్‌నగర్‌లో నివసిస్తున్న వృద్ధురాలు పెంటమ్మ(65) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన పెంటమ్మ కుంటుంబసభ్యులకు ఆమె అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో కబీర్‌నగర్ బస్తీ అధ్యక్షుడు జోసెఫ్ కెరీటన్ విషయాన్ని ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఆఫీసర్ కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. ఆయన వెంటనే స్పందించి పెంటమ్మ నివాసానికి చేరుకుని తన సహచర ఉద్యోగులు, సామాజిక ప్రతినిధులతో చర్చించి అంత్యక్రియలకు అవసరమైన రూ. 21 వేలను శనివారం పెంటమ్మ కుంటుంబసభ్యులకు అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డికి, లయన్ ఎం.రాజశేఖర్, 1104 యూనియన్ నాయకులు అరుణ్‌కుమార్, సర్వేశ్వర్, సురేందర్‌కుమార్, జేఏవోలు మాధవి, కవిత, తదితరులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

దుండిగల్, ఏప్రిల్ 13 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వివిధ పార్టీల నేతలు శనివారం వేర్వేరు చోట్ల జరిగిన కార్యక్రమాలల్లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నిజాంపేట్‌కు చెందిన మాజీ సర్పంచ్ వడ్లనగేశ్ చారి తన అనుచరులతో కలిసి కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి నగేశ్‌చారి తదితరులకు పార్టీకండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు.

-ప్రగతినగర్‌లోని కేజీఆర్ కన్వెన్షన్‌లో మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కూనశ్రీశైలంగౌడ్,మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన పలుపార్టీల నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పలువురు కార్పొరేటర్లతో పాటు సీనియర్ నాయకులు కొలన్‌గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

అదృశ్యమైన తల్లీ కూతుళ్లు ప్రియాంక, సాక్షి(ఫైల్)

దుండిగల్,ఏప్రిల్ 13 : భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కూతురిని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది ఓ వివాహిత. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం సర్కిల్ సూరారం డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎం. సాయిరాం, ప్రియాంక(23)కు మూడేళ్ల క్రితం పెళ్లి అయ్యింది. వీరికి రెండేళ్ల కూతురు సాక్షి ఉన్నది. సాయిరాం ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, ప్రియాంక పాపను చూసుకుంటూ ఇంటి వద్దనే ఉంటున్నది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున సైతం దంపతుల మధ గొడవ జరగడంతో ప్రియాంక కూతురుని తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఉదయం 7 గంటలకు సాయిరాం నిద్రలేచి చూడగా భార్య, పాప కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. బంధువులు,స్నేహితుల ఇండ్లల్లో ఆరా తీసినప్పటికీ ఫలితం లేకపోవడంతో సాయిరాం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదగాళ్ల అరెస్ట్

కొండాపూర్, ఏప్రిల్ 13 : లాడ్జిలో పేకాడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజరాజేశ్వరీ కాలనీలో ఉన్న ఓ లాడ్జిలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న సైబరాబాద్ ఎస్ఓటీ, గచ్చిబౌలి పోలీసులు లాడ్జిపై దాడి చేసి పేకాట ఆడుతున్న శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వహకుడు బస్వరాజ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. 7 సెట్ల పేకలతో పాటు రూ. 1.52 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు అంబేద్కర్ జయంతి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

హెచ్ఐసీసీలో లైవ్‌లో మోకాలి శస్త్రచికిత్స

● హాజరైన వివిధ దేశాల వైద్య నిపుణులు

మోకాలి శస్త్ర చికిత్స విధానంపై చర్చిస్తున్న వరల్డ్ రినోవ్డ్ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ క్రిష్టియన్ క్లే, తదితరులు

మాదాపూర్, ఏప్రిల్ 13: సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజూరీ, ఆర్థోస్కోపీ (ఎస్ఐఎస్ఏ) 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మోకాలి శస్త్ర చికిత్స లైవ్ కాన్ఫరెన్స్ 2024 నిర్వహించారు. జర్మనీకి చెందిన వరల్డ్ రినోవ్డ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ క్రిష్టియన్ క్లే, యూకేకు చెందిన మోకాలి చికిత్సనిపుణుడు ప్రొఫెసర్ ఆడ్రియన్ విల్సన్, లైవ్ సర్జన్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రఘువీర్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మోకాలి కీళ్ల సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ చికిత్సలు ఉంటాయని,వీటికి విరుద్ధంగా మోకాలి మార్పిడి అనే పద్ధతిలో మోకాలి కీలులో దెబ్బతిన్న భాగాలను తొలగించి, వాటి స్థానంలో కృత్రిమ భాగాలను అమర్చడం జరుగుతుందన్నారు. తీవ్రమైన ఆర్థరైటిస్ ఉన్న రోగులకు మోకాలి కీళ్ల మార్పిడి ప్రత్యామ్నాయ చికిత్సగా చెప్పుకోవచ్చన్నారు.

అంతేకాకుండా మోకాలు చికిత్సకు సంబంధించి పలు విధానాలను వివరించారు. ఎస్ఐఎస్ఏ 25 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో లైవ్ సర్జరీని నిర్వహించారు. పలువురు యువ వైద్యులు ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ రంగంలో మెళకువలను తెలుసుకునేందుకు, అనుభవాలను పంచుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఆది వారం కూడా ఈ కార్యక్రమం కొనసాగు తుందని పేర్కొన్నారు. పలు దేశాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రోటీ కోసం రౌడీషీటర్ హల్‌చల్!

● ధాబా నిర్వాహకులపై దాడి
● వంట సామగ్రి, సీసీ కెమెరాలు ధ్వంసం
● అడ్డుకోబోయిన స్థానికులపైనా దాడి..
● అనంతరం పరారీ..
● పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో ఘటన

రౌడీషీటర్ వదిలి వెళ్లిన స్కూటీలో లభించిన వేటకొడవలి

కుత్బుల్లాపూర్,ఏప్రిల్13 : కుత్బుల్లాపూర్‌లో రౌడీషీటర్ గ్యాంగ్ హల్‌చల్ సృష్టించింది. మద్యం మత్తులో ఓ ధాబాలోకి వెళ్లిన గ్యాంగ్ రోటీ ఆర్డర్ చేయగా.. సమయం పడుతుందని చెప్పడంతో నిర్వాహకులపై విచక్షణారహితంగా వంట సామగ్రితో దాడి చేశారు. అడ్డుకోబోయిన స్థానికులపై సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ధాబా యజమాని పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కుత్బుల్లాపూర్ విలేజ్‌కి చెందిన షేక్‌గౌస్(29)రౌడీషీటర్(గతంలో జవహర్‌నగర్‌లో జరిగిన ఓ కేసులో నిందితుడు)తో పాటు మరో ముగ్గురు మద్యం సేవించి శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో భాగ్యలక్ష్మికాలనీ రోడ్ నంబర్-4లో ఉన్న పంజాబీ ధాబాలో తినేందుకు వెళ్లారు. అక్కడ ధాబా నిర్వాహకుడు రోమియోకుమార్‌ను రోటీ కావాలని అడిగారు. ఐదు నిమిషాలు సమయం పడుతుందని చెప్పగా కొపోద్రిక్తులైన రౌడీషీటర్ దుర్భాషలాడుతూ కిచెన్‌లోకి వెళ్లి అందులో పని చేస్తున్న విశాల్‌కుమార్, పర్వేజ్‌లపై వంటసామగ్రితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ధాబాలో ఉన్న వస్తువులను, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అక్కడితో ఆగకుండా రోడ్డుపై వెళ్తున్న వారిపైనా దాడికి పాల్పడి పక్కనే ఉన్న జిరాక్స్‌సెంటర్‌లోకి దూరి అందులోని ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గుమికూడడంతోపాటు పోలీసులు వస్తున్నారనే సమాచారంతో రోడ్డుపై వెళ్తున్న ఓ ద్విచక్రవాహనదారుడిని బెదిరించి అతడి వాహనాన్ని లాక్కొని పరారయ్యారు.

ద్విచక్రవాహనంలో మారణాయుధం...

సంఘటన స్థలంలో రౌడీషీటర్ తన ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లాడు.

వాహనం డిక్కీలో వేటకొడవలి లభ్యమవడంతో స్థానికులు భయాందోళనకు గుర య్యారు. కాగా జనవాసాల మధ్య రౌడీషీటర్ విచ్చలవిడిగా దాడికి పాల్పడటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ విషయంపై పేట్ బషీరాబాద్ ఎస్‌హెచ్ఓ విజయ్‌వర్ధన్, సెక్టార్ ఎస్ఐ సరితను వివరణ కోరగా భాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. కాగా దాడిలో పాల్గొన్న క్రిష్ణ(31) ను అదుపులోకి తీసుకున్నామని, ప్రధాన నిందితుడైన రౌడీషీటర్ షేక్‌గౌస్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల బూటకపు మాటలు నమ్మొద్దు

● బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్,ఏప్రిల్13 : కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే బూటకపు మాటలు నమ్మి తెలంగాణ ప్రజలు మరోసారి మోసపోవద్దని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఓబీసీ సెల్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ. సతీశ్‌సాగర్ ఆధ్వర్యంలో సాయికృప అపార్ట్‌మెంట్, దూలపల్లి గంగస్థాన్, జయదర్శినిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశాల్లో ఈటెల పాల్గొని ప్రసంగించారు. గత ఎన్నికల్లో మోసపూరిత వాగ్దా నాలు ఇచ్చి గద్దెనెక్కి వంద రోజులు దాటినా హామీలు అమలు చేయకపోవడం నయవంచనకు నిదర్శనమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి మల్కాజిగిరిలో బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యర్థుల మాటల మాయలోపడి మోసపోవద్దని ప్రజలకు సూచించారు.

సమావేశంలో భారతీయ జనతా పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిపవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా నాయకులు శివాజీరెడ్డి, మహిళా మోర్చా నేతలు సంధ్య, మాధురి, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రంజాన్ శుభాకాంక్షలు

ముఖ్యమంత్రి రేవంతర్‌రెడ్డిని మల్కాజిగిరి పార్లమెంట్‌నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ మోయిజ్ ప్రత్యేకంగా కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ నేతలు ఉన్నారు.

– కేప